సాక్షి అనకాపల్లి

బుధవారం ၊ 26 ၊ ఫిబ్రవరి ၊ 2025



పంచదార్లలో కొలువైన ఉమాధర్మలింగేశ్వరుడు



శివపూజకు వేళాయె..

మహాశివరాత్రి పర్వదినాన మహేశ్వరుడిని అర్చించేందుకు శివాలయాలు ముస్తాబయ్యాయి. పంచాక్షరి ప్రతిధ్వనులతో వేకువజాము నుంచి పూజలు ప్రారంభం కానున్నాయి. 8లో

న్యూస్‌రీల్

పంట కాలువల ఆక్రమణల తొలగింపు



రాంబిల్లి కొండవారిపాలెం గ్రామం వద్ద ఒక పరిశ్రమ ఎదుట పొక్లెయిన్‌తో తూరలను తొలగిస్తున్న రెవెన్యూ అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

రాంబిల్లి (యలమంచిలి) : రాంబిల్లి మండలంలో పంట కాలువలు ఆక్రమణలపై రెవెన్యూ అధికారులు దృష్టి సారించి మంగళవారం తొలగింపు చర్యలు ప్రారంభించారు. ఈ నెల 24న సాక్షి పత్రికలో సాగుకు అందనీరు అనే కథనంపై రెవెన్యూ అధికారులు స్పందించారు. తహసీల్దారు శ్రీనివాసరావు ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు మండలంలో కొండవారిపాలెం సమీపంలో ఉన్న ఒక పరిశ్రమ ఎదుట పంటకాలువపై తాత్కాలికంగా ఏర్పాటు చేసిన సిమెంట్ తూరల వంతెనను మంగళవారం పొక్లెయిన్ సహాయంతో తొలగింపు చర్యలు చేపట్టారు. ఎన్నికల విధుల వల్ల మరో రెండు రోజుల్లో మిగిలిన పంచదార్ల కొనేరు వద్ద పంటకాలువపై అక్రమంగా ఏర్పాటు చేసిన సిమెంట్ తూరల వంతెన, గోవిందపాలెం, రాంబిల్లి మధ్య ఉన్న తూరల వంతెన, భోగాపురం వద్ద ఉన్న పంటకాలువ ఆక్రమణలు తొలగింపు చర్యలు చేపట్టడం జరుగుతుందని ఆర్ఐ రవికుమార్ సాక్షికి మంగళవారం రాత్రి తెలిపారు.

హోం గార్డు కుటుంబానికి రూ.4.12 లక్షల చెక్కు అందజేత



దివంగత హోంగార్డు బాబూరావు భార్య గవ్వ వీరలక్ష్మికి చెక్కును అందజేస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి: అంకిత భావంతో విధులు నిర్వహించిన పోలీసు సిబ్బందికి, హోం గార్డులకు గుర్తింపు ఉంటుందని ఎస్పీ తుహిన్ సిన్హా అన్నారు. నర్సీపట్నం టౌన్ పోలీస్ స్టేషన్‌లో హోం గార్డుగా విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మరణించిన గవ్వ బాబూరావు భార్య గవ్వ వీరలక్ష్మికి ఉమ్మడి విశాఖ జిల్లా హోం గార్డుల ఒక రోజు వేతనం, ఇతర అలవెన్సులు కలిపి రూ.4,12,140ల చెక్కును మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఉమ్మడి విశాఖ జిల్లాలో హోం గార్డులు పదవీ విరమణ పొందినప్పుడు లేదా మరణించినప్పుడు ఒక రోజు వేతనాన్ని వారికి అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కార్యాలయం ఏవో ఎ.రామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తండ్రి రుణం తీర్చుకుంది..



తండ్రి సత్యనారాయణకు అంతిమ సంస్కారాలు నిర్వహిస్తున్న రమణి

యలమంచిలి రూరల్: తండ్రి చితికి కుమారుడు తలకొరివి పెట్టే ఘటనలు చూస్తూనే ఉంటాం.. కానీ కుమార్తె తండ్రి చితికి తలకొరివి పెట్టిన సంఘటన యలమంచిలి పట్టణంలో మంగళవారం చోటు చేసుకుంది. పట్టణంలోని అయోధ్యపురి కాలనీకి చెందిన మళ్ల సత్యనారాయణ (52) బ్రెయిన్‌స్ట్రోక్‌తో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. సత్యనారాయణ, లక్ష్మి దంపతులకు సంతానం లేకపోవడంతో బంధువుల కుటుంబానికి చెందిన రమణిని దత్తత తీసుకున్నారు. ప్రస్తుతం రమణి బీఎస్సీ చదువుతోంది. సత్యనారాయణకు కుమారులు లేకపోవడంతో కుమార్తె రమణి స్థానిక శ్మశాన వాటికలో తండ్రి చితికి తలకొరివి పెట్టి దహన సంస్కారాలు చేసింది. తండ్రి రుణం తీర్చుకుంది.

ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం

- ముగిసిన ప్రచార పర్వం.. రేపటి పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి
- పీవో, ఏపీవో, మైక్రో అబ్జర్వర్లకు రెండు విడతల శిక్షణ
- ఉత్తరాంధ్రలో ఓటు హక్కు వినియోగించుకోనున్న 22,493 మంది టీచర్లు
- పోలింగ్ నిర్వహణకు 739 మంది సిబ్బంది నియామకం



ఎన్నికల ఏర్పాట్లపై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్



సాక్షి, అనకాపల్లి: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. ఎన్నికల బరిలో 10 మంది అభ్యర్థులు పోటీ పడుతుండగా.. ఈ నెల 27వ తేదీన పోలింగ్ జరగనుంది. ఎన్నికల ప్రచార పర్వం మంగళవారం సాయంత్రంతో ముగిసింది. ఉత్తరాంధ్రలో 22,493 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. పోలింగ్ నిర్వహణకు 739 మంది సిబ్బందిని నియమించారు. భద్రత కోసం 800 మంది పోలీసులు కేంద్రాల వద్ద పహరా కాయనున్నారు. అనకాపల్లి జిల్లాలో 24 పోలింగ్ కేంద్రాల్లో మొత్తం 2,885 మంది టీచర్లు తమ ఓటు హక్కుని వినియోగించుకోనున్నారు. వారిలో 1,789 మంది పురుషులు, 1,096 మంది మహిళలు ఉన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం ఎండ వేడిమి తగలకుండా షామియానాలు, తాగునీరు, బయోటాయిలెట్లు ఏర్పాటు చేశారు. ఓటర్లు సులభంగా పోలింగ్ కేంద్రంలోకి చేరుకునే విధంగా మహిళలకు, పురుషులకు వేర్వేరుగా క్యూలైన్లు సిద్ధం చేశారు. పోలింగ్‌కు 48 గంటల ముందుగానే సైలెంట్ పీరియడ్ అమల్లోకి రావడంతో 144 సెక్షన్ విధించారు. 27వ తేదీ ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. మార్చి 3న కౌంటింగ్ ప్రక్రియ ఉంటుంది. 8వ తేదీతో ఎన్నికల ప్రక్రియ ముగుస్తుంది. ఇప్పటికే ఓటర్ స్లిప్పుల పంపిణీ పూర్తయింది. ప్రత్యేక అవసరాలుగల ఓటర్ల కోసం పోలింగ్ కేంద్రాల వద్ద వీల్ చైర్లు అందుబాటులో ఉంచారు.

24 పోలింగ్ కేంద్రాలు.. 145 మంది సిబ్బంది

ఉత్తరాంధ్ర పరిధిలో 123 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు వీలుగా సుమారు 739 మంది అధికారులను, సిబ్బందిని కేటాయించారు. అనకాపల్లి జిల్లాలో 24 పోలింగ్ కేంద్రాలున్నాయి. 145 మంది సిబ్బందిని నియమించారు. వీరిలో 24 మంది పీవోలు, 24 మంది ఏపీవోలు, 48 మంది ఓపీవోలు, 24 మంది మైక్రో అబ్జర్వర్లు ఉన్నారు.

పటిష్ట బందోబస్తు

ఎన్నికలను సజావుగా, ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు అధికారులు అన్ని రకాల చర్యలు తీసుకున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. పోలింగ్ ఏజెంట్లు, సిబ్బందితో పాటు ఓటర్లు కేంద్రం లోపలికి సెల్ ఫోన్లు తీసుకెళ్లకూడదు. హోటళ్లు, లాడ్జిలు, ఫంక్షన్ హాళ్లలో ముందస్తు తనిఖీలు నిర్వహించి.. అనుమానిత వ్యక్తులు ఉంటే చర్యలు తీసుకునేలా వ్యవస్థను ఏర్పాటు చేశారు. ప్రచారపర్వం ముగిసినందున బయట వ్యక్తులు ఉత్తరాంధ్రలో ఉండకూడదని ఎన్నికల కమిషన్ స్పష్టం చేసింది.

నేడు అనకాపల్లి జీవీఎంసీ హైస్కూల్లో డిస్ట్రిబ్యూషన్ సెంటర్లు

అనకాపల్లి టౌన్‌లో గల జీవీఎంసీ హైస్కూల్లో 10 డిస్ట్రిబ్యూషన్ సెంటర్లు ఏర్పాటు చేశారు. బుధవారం ఉదయం 8 గంటలకు ఇక్కడ ఎన్నికల సామగ్రి అందిస్తారు. జిల్లాలో 24 పోలింగ్ కేంద్రాలను 10 రూట్‌లుగా డివైడ్ చేసి 10 మంది సెక్టార్ అధికారులను నియమించారు. 10 రూట్‌లకు 10 బస్సులను ఏర్పాటు చేశారు. ఒక్కో పోలింగ్ కేంద్రం వద్ద ఒక పీవో, ఒక ఏపీవో, మరో ఇద్దరు అధికారులు, ఒక మైక్రో అబ్జర్వర్ ఉంటారు. జిల్లాలో మొత్తం 145 మంది ఎన్నికల సిబ్బందిని నియమించారు. వీరితో పాటుగా ఒక్కో పోలింగ్ కేంద్రం వద్ద ఒక ఎస్సై, ఒక హెడ్ కానిస్టేబుల్, ఇద్దరు కానిస్టేబుళ్లు, స్ట్రైకింగ్ ఫోర్స్ ఉంటుంది. ఎన్నికల సిబ్బందికి పోలింగ్ కేంద్రాల వద్ద లాజిస్టిక్స్ ఏర్పాటు చేస్తారు. కలెక్టర్ విజయ కృష్ణన్ మంగళవారం ఎన్నికల ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించి దిశానిర్దేశం చేశారు.

పోలింగ్ కేంద్రం వద్ద ఇన్, అవుట్ సబ్‌కాస్టింగ్

పోలింగ్ కేంద్రం వద్ద పటిష్టమైన నిఘా ఉంటుంది. పోలింగ్ కేంద్రంలో ఇన్, అవుట్ సబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రం బయట క్యూ పరిశీలించడానికి వెబ్ కెమెరాలను బిగించారు. పోలింగ్ సరళి పరిశీలించడానికి కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూంను ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు నీటి సదుపాయం కల్పించారు.

జిల్లా	పోలింగ్ కేంద్రాలు	పురుష ఓటర్లు	మహిళా ఓటర్లు	మొత్తం ఓటర్లు	పోలింగ్ సిబ్బంది
శ్రీకాకుళం	31	3,416	1,619	5,035	185
విజయనగరం	29	3,270	1,953	5,223	175
పార్వతీపురం మన్యం	15	1,574	759	2,333	90
అల్లూరి సీతారామరాజు	11	920	568	1,488	65
అనకాపల్లి	24	1,789	1,096	2,885	145
విశాఖపట్నం	13	2,539	2,990	5,529	79
మొత్తం	123	13,508	8,989	22,493	739

అనకాపల్లి జిల్లా వివరాలు

- ఓటర్ల సంఖ్య 2,885
- ఎన్నికల సిబ్బంది 145
- పోలింగ్ కేంద్రాలు 24

ఎమ్మెల్సీ ఎన్నికకు పటిష్ట ఏర్పాట్లు

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు పటిష్ట ఏర్పాట్లు చేశాం. ఇప్పటికే ఎన్నికల సిబ్బందికి (పీవో, ఏపీవో, మైక్రో అబ్జర్వర్లు) రెండు విడతల శిక్షణ అందించాం. పోలింగ్ కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నాం. మంగళవారంతో ప్రచార ప్రక్రియ ముగిసింది. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ప్రకారం 25వ తేదీ మంగళవారం సాయంత్రం 4 గంటల నుంచి 27వ తేదీ వరకూ బహిరంగ సభల ద్వారా గానీ, వాట్సాప్, ఎస్ఎంఎస్‌ల ద్వారా గానీ అభ్యర్థులు ప్రచారం చేయకూడదు. పోలింగ్, కౌంటింగ్ రోజులను డ్రైడేలుగా పాటించాలి. ఓటరు ఎపిక్ కార్డు గాని లేదా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తెలియజేసిన గుర్తింపు కార్డులను ఓటు వేసే సమయంలో వెంట తెచ్చుకోవాలి.

– విజయ కృష్ణన్, కలెక్టర్, అనకాపల్లి

మహాశివరాత్రికి ప్రత్యేక బస్సులు

అనకాపల్లి: మహాశివరాత్రిని పురస్కరించుకుని అనకాపల్లి, నర్సీపట్నం డిపోల నుంచి జిల్లాలో కల్యాణపులోవ, దారమఠం, విజయనగరం జిల్లా పుణ్యగిరిలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్టు ప్రజారవాణాశాఖ (ఆర్టీసీ) జిల్లా అధికారి కె.పద్మావతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కల్యాణపులోవకు అనకాపల్లి డిపో నుంచి 30 బస్సులు, నర్సీపట్నం డిపో నుంచి 45 బస్సులు, దారమఠానికి నర్సీపట్నం డిపో నుంచి 15 బస్సులు, విజయనగరం జిల్లా పుణ్యగిరికి అనకాపల్లి డిపో నుంచి 10 ప్రత్యేక బస్సులు నడుస్తాయన్నారు. ఈనెల 26వ తేదీ సాయంత్రం నుంచి 27వ తేదీ సాయంత్రం వరకూ ఈ బస్సులు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.

బియ్యం గింజలతో శివలింగం



బియ్యం గింజలతో తయారు చేసిన శివలింగం

మాకవరపాలెం: తూటిపాలకు చెందిన మైక్రో రైటర్ రవికుమార్ బియ్యం గింజలతో శివలింగాన్ని రూపొందించాడు. బుధవారం శివరాత్రిని పురస్కరించుకుని బియ్యం గింజలపై సూక్ష్మ కళతో ఓం నమఃశ్శివాయ అని లిఖించాడు. ఈ లింగాన్ని తయారు చేసేందుకు 1086 బియ్యం, 80 ఆవగింజలను వినియోగించినట్టు తెలిపాడు. 15 గంటల పాటు శ్రమించి ఈ శివలింగాన్ని రూపొందించినట్టు చెప్పాడు.

చికెన్ మేళా అదుర్స్



చికెన్ డిష్ రుచి చూస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్

- అనకాపల్లిలో వేలాదిగా పాల్గొన్న జనం
- రకరకాల వంటకాలకు ముగ్ధులైన చికెన్ ప్రియులు



మేళాకు హాజరైన జనం



కోడి మాసం, ఎగ్ పౌష్టికాహారం అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్ తదితరులు

అనకాపల్లి టౌన్: చికెన్ మేళా అదిరింది. అందరికీ మళ్లీ నోరూరింది. మన జిల్లాలో కోడి మాంసం, గుడ్లకు ఎలాంటి ఢోకా లేదని నిర్భయంగా తినవచ్చని అర్థమయ్యేలా చేసింది. స్వయంగా కలెక్టర్ విజయ్ కృష్ణన్ పాల్గొని చికెన్ వంటకాలు రుచి చూశారు. ఎలాంటి భయాలు పెట్టుకోవద్దని పిలుపునిచ్చారు. స్థానిక ఎన్టీఆర్ గ్రౌండ్‌లో నేషనల్ ఎగ్ కో–ఆర్డినేషన్ కమిటీ, జిల్లా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో చికెన్, ఎగ్ మేళా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడా బర్డ్‌ఫ్లూ వ్యాధి లేదని వైద్యాధికారులు ధ్రువీకరించారని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా చెక్ పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. ఇతర జిల్లాల నుంచి కోళ్లు, ఎగ్స్ రవాణాపై నిరంతరం నిఘా పెట్టామన్నారు. చికెన్‌ను ఉడికించిన తర్వాత ఎటువంటి బ్యాక్టీరియా అయినా చనిపోతుందన్నారు. వదంతులు, అపోహలు వీడి నిర్భయంగా చికెన్, ఎగ్ తినవచ్చన్నారు. పౌల్ట్రీ రంగాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.

సూపర్ సక్సెస్

చికెన్, ఎగ్ మేళా విజయవంతం కావడంతో నిర్వాహకులు ఆనందం వ్యక్తం చేశారు. చికెన్ ఫ్రై, ఉడికించిన గుడ్డు ప్రతీ ఒక్కరికీ అందేలా పటిష్టమైన చర్యలు చేపట్టారు. సుమారు 3 గంటలపాటు సాగిన ఈ మేళాకు 10 వేల మందికి పైగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఆయిషా, పశుసంవర్ధక శాఖ అధికారులు, రెడ్‌క్రాస్ చైర్మన్ డాక్టర్ శ్రీరామ్మూర్తి, నెక్ సెంట్రల్ కమిటీ మెంబర్ బి.రామారావు, జోనల్ చైర్మన్ టి.శ్రీధర్, ఏపీ పౌల్ట్రీ ఫెడరేషన్ నార్త్ ఆంధ్రా రీజనల్ అధ్యక్షుడు బి.సాయినాథ్‌రావు, నేషనల్ ఎగ్ కో–ఆర్డినేషన్ కమిటీ సభ్యుడు మందపాటి జానకీరామరాజు, జాజుల రమేష్, అధిక సంఖ్యలో మహిళలు, స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి మండలంలో ఓ ప్రకృతి వ్యవసాయ గ్రామం

- ప్రతి మండలంలో ఓ ప్రకృతి వ్యవసాయ గ్రామం
- రానున్న రెండు నెలల్లో ప్రణాళిక రూపొందించుకోవాలి
- కలెక్టర్ విజయ కృష్ణన్

తుమ్మపాల : ప్రతి మండలంలో ఒక గ్రామాన్ని పూర్తిగా ప్రకృతి వ్యవసాయ గ్రామంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రైతు సాధికార సంస్థ, వ్యవసాయశాఖ, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులతో ఖరీఫ్–2025 సంవత్సరంలో ప్రకృతి వ్యవసాయం లక్ష్యాలపై ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో ప్రకృతి వ్యవసాయం సాగు అభివృద్ధి చేయడానికి రానున్న రెండు నెలల్లో చేయవలసిన పనులపై ప్రణాళిక రూపొందించుకోవాలని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం చేయుటకు కావలసిన వనరులు గల గ్రామాలను ముందుగా గుర్తించాలన్నారు. ప్రకృతి వ్యవసాయానికి వనరుగా అవసరమైన గో సంపదకు సంబంధించిన సమాచారం పశుసంవర్ధకశాఖ వారి నుండి తీసుకోవాలన్నారు. ముందుగా గ్రామస్థాయి, మండల స్థాయిలలో కనీసం మూడు సమావేశాలు నిర్వహించాలన్నారు. ప్రతి మండలానికి ఒక గ్రామాన్ని గుర్తించి నూరు శాతం ప్రకృతి వ్యవసాయం అమలు చేయాలన్నారు. వ్యవసాయ పనులు ప్రారంభించుటకు ముందే సిబ్బంది అందరూ క్షేత్ర స్థాయిలో పర్యటించాలని, రైతులు పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయానికి మారే విధంగా ప్రోత్సాహించాలని, రైతులు సందేహాలను నివృత్తి చేయాలన్నారు. రైతు సేవా కేంద్రాలలో ప్రకృతి వ్యవసాయానికి సంబంధించిన మందులు అందుబాటులో ఉంచాలని, వాటిపై రైతులకు అవగాహన కల్పించాలని, వాటి వినియోగంపై విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ఆ ప్రాంతాలలో రసాయన ఎరువులు వాడకం చాలా తక్కువని అధికారులకు సూచించారు. రైతు సాధికార సంస్థ, వ్యవసాయశాఖ, గ్రామీణాభివృద్ధి శాఖలు సమన్వయంతో పనిచేసి ఈ పథకాన్ని విజయవంతం చేయాలన్నారు. జిల్లాలో 32 వేల ఎకరాలకు సంబంధించి 84 శాతం ఈ–పంట నమోదు పూర్తయిందని, ఈ నెల 28 నాటికి నూరుశాతం ఈ–పంట నమోదుతో పాటు, ఈ–కెవైసీ కూడా పూర్తిచేయాలని జిల్లా కలెక్టరు ఆదేశించారు. ఫార్మర్ రిజిస్టరీ పక్రియ నిర్ణీత సమయంలో పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి బి.మోహనరావు, రైతు సాధికార సంస్థ జిల్లా ప్రాజెక్టు మేనేజరు లచ్చన్న, మండల వ్యవసాయ అధికారులు, డీఆర్‌డీఏ ఏపీఎంలు పాల్గొన్నారు.

కోడ్ అమలులో 'పచ్చ'పాతం



దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి వేసిన ముసుగు



కశింకోటలోని ఆటో స్టాండ్ వద్ద ముసుగు వేయని ఎన్టీ రామారావు విగ్రహం

కశింకోట: కశింకోటలో ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రవర్తనా నియమావళి పూర్తిగా అమలు చేయకపోవడంపై స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 27న జరగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల దృష్ట్యా ఎన్నికల నియమావళి ప్రకారం స్థానిక పంచాయతీ ప్రధాన రహదారిలో ఉన్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, మాజీ ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ, తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న మాజీ ఎంపీ గుడివాడ గురునాథరావు తదితర రాజకీయ నాయకుల విగ్రహాలకు ఇటీవల అధికారులు, పంచాయతీ సిబ్బంది ముసుగులు వేసి ముఖాలు కనిపించకుండా మూసివేశారు. అయితే స్థానిక ఆటో స్టాండ్ వద్ద సతీమణితో ఉన్న మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు విగ్రహానికి మాత్రం ముసుగు వేయకుండా వదిలేశారు. దీంతో స్థానికులు విస్తుపోతున్నారు. ప్రతిపక్ష పార్టీల నాయకుల విగ్రహాలకు ముసుగులు వేసి, టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీ రామారావు విగ్రహానికి మాత్రం ఎందుకు వేయలేదని ప్రశ్నిస్తున్నారు. ఎన్నికల నిబంధనలు పూర్తిగా అమలు చేయాలని కోరుతున్నారు.

ఆర్థిక నిర్ణయాల్లో ఆర్‌బీఐదే కీలకపాత్ర

- రాజకీయాలతోనే కో–ఆపరేటివ్ బ్యాంకులకు ఇబ్బందులు
- ప్రజాజీవనం సాఫీగా సాగేలా రిజర్వు బ్యాంకు కార్యకలాపాలు
- ఆర్‌బీఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు



మాట్లాడుతున్న దువ్వూరి సుబ్బారావు

విశాఖ విద్య: దేశ ఆర్థిక సుస్థిరతలో ఆర్‌బీఐ కీలక పాత్ర పోషిస్తోందని ఆ సంస్థ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు అన్నారు. 'సెంట్రల్ బ్యాంకింగ్‌లో సందిగ్ధతలు– భారతీయ రిజర్వ్ బ్యాంకు ప్రజల రోజువారీ జీవితాలతో ఎలా అనుసంధానమవుతోంది'అనే అంశంపై ఆంధ్ర యూనివర్సిటీ ప్రాంగణంలోని వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో మంగళవారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. దేశం ఆర్థిక స్థిరత్వాన్ని కొనసాగించటంలో ఆర్‌బీఐ తీసుకున్న నిర్ణయాలే కారణమన్నారు. అందరూ భావిస్తున్నట్లు కరెన్సీ నోట్ల ముద్రణ ఒక్కటే ఆర్‌బీఐ పాత్ర కాదని, మేనేజ్‌మెంట్ చేయటం, మానిటరీ పాలసీలను రూపొందించటంలోనూ ఆర్‌బీఐ నిర్ణయాత్మకంగా వ్యవహరిస్తుందన్నారు. సాధారణ ప్రజల రోజువారీ జీవనంలో సాగే అన్ని ఆర్థిక పరమైన వ్యవహారాల్లో పరోక్షంగా ఆర్‌బీఐ పాత్ర ఉంటుందని స్పష్టం చేశారు. తాను ఆర్‌బీఐ గవర్నర్‌గా ఉన్న రోజుల్లో ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాల్లో ప్రముఖ సంస్థలు పతనావస్థలో ఉన్నాయని, దీని వల్ల ఆయా దేశాల ఆర్థిక వ్యవస్థలు కుప్పకూలినట్లు తెలిపారు. అటువంటి పరిస్థితుల్లో ఎన్నో సవాళ్లను అధిగమించి, భారత్‌పై ఆర్థిక మాంద్యం ప్రభావం లేకుండా జాగ్రత్తలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఆర్‌బీఐ స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన సంస్థ అయినప్పటికీ, కొన్ని పరిమితులకు లోబడి కార్యకలాపాలు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. రాష్ట్రంలోని కొన్ని కో–ఆపరేటివ్ బ్యాంకులు రాజకీయాల వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయన్నారు. రాష్ట్రాల్లో బలమైన వ్యవస్థలు కొనసాగినప్పుడే, ఆర్థికంగా బలోపేతమయ్యే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐడీఎస్ ఏపీ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్ గలాబ్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎమ్మెల్సీ అభ్యర్థి గాదెకు ఓటు వేయాలి



ఓటును అభ్యర్థిస్తున్న పీఆర్టీయూ నాయకులు

కె.కోటపాడు: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్టీయూ, ఉమ్మడి సంఘాలు బలపర్చిన గాదె శ్రీనివాసులనాయుడుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని పీఆర్టీయూ రాష్ట్ర కార్యదర్శి అడిగర్ల సత్యంనాయుడు, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి పోతల నాయుడుబాబు, ప్రవీణ్ కోరారు. మండలంలో చౌడువాడ, కె.కోటపాడు, ఎ.కోడూరు, పాతవలస, కొరువాడ, మేడిచర్ల, గొందుపాలెం హైస్కూల్స్, కేజీబీవీలో ఉపాధ్యాయులను మంగళవారం వీరు కలిసి ఓటును వేయాలని కరపత్రాలను అందించారు. ఉపాధ్యాయ సమస్యల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉన్న వ్యక్తి గాదె అని, వాటి పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేయనున్నట్లు తెలిపారు. పీఆర్టీయూ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వైష్ణవ కరుణానిధి తదితరులు పాల్గొన్నారు.

వచ్చే నెలలో రెండు రోజుల జాతీయ సదస్సు



జాతీయ సదస్సు గోడపత్రికను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్, సిబ్బంది

చోడవరం రూరల్ : వచ్చే నెల 11,12 తేదీల్లో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ స్థాయి సదస్సు నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ పి.కిరణ్‌కుమార్ తెలిపారు. రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో మొదటిసారిగా 'రసాయన శాస్త్రం- నూతన పోకడల ద్వారా పర్యావరణ సుస్థిరత' అంశం పట్ల జాతీయ స్థాయిలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ప్రచార గోడపత్రికను విడుదల చేశారు. సదస్సులో పేరెన్నికగన్న ఐఐటీ, ఐఐఎస్ఈఆర్, ఎస్ఆర్ఎం వంటి సంస్థలనుంచి శాస్త్రవేత్తలు పాల్గొంటారని చెప్పారు. ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ లక్ష్మీమంగమ్మ, ఉపన్యాసకులు రత్నభారతి, సుధీర్, వెంకటేష్, రాధాకృష్ణ, అప్పలనాయుడు పాల్గొన్నారు.

శివపూజకు వేళాయె..



- శివరాత్రి ఉత్సవాలకు పంచదార్ల, కల్యాణపులోవ ముస్తాబు
- పుణ్యక్షేత్రాల వద్ద బారికేడ్లు, షామియానాల ఏర్పాటు
- జిల్లా నలుమూలల నుంచి తరలిరానున్న భక్తజనం



ప్రసిద్ధిగాంచిన అతిపురాతన చోడవరం స్వయంభూ గౌరీశ్వరస్వామి ఆలయం



కల్యాణపులోవలో ఉత్సవాలకు సిద్ధమైన పోతురాజుబాబు



ధారమఠంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న నర్సీపట్నం డీఎస్పీ శ్రీనివాసరావు

రావికమతం: పరమ పవిత్రమైన మహా శివరాత్రి ఉత్సవాలకు శివాలయాలు ముస్తాబయ్యాయి. బుధవారం వేకువజాము నుంచే పెద్ద ఎత్తున తరలి రానున్న భక్తులతో కిటకిటలాడనున్నాయి. ఆ మేరకు ఉత్సవ కమిటీ, దేవదాయ శాఖ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఉత్తరాంధ్రలో ప్రసిద్ధి గాంచిన ప్రముఖ శైవక్షేత్రం పోతురాజుబాబు, పెద్దింటమ్మ వార్ల ఉత్సవాలు ఈ నెల 26 నుంచి 28 వరకూ నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఉత్సవమూర్తులను దర్శించుకునేందుకు ఉత్తరాంధ్ర జిల్లాల నలుమూలల మూడు లక్షల మంది వరకూ భక్తులు తరలివస్తారని అంచనా వేసి, అందుకు తగ్గట్టుగానే ఏర్పాట్లు చేశారు.

జాతరకు ఏర్పాట్లు పూర్తి

కలెక్టర్ విజయ్ కృష్ణన్ ఆదేశాల మేరకు నర్సీపట్నం ఆర్డీవో వి.వి.రమణ పర్యవేక్షణలో దేవదాయ, రెవెన్యూ మండల పరిషత్, ఇరిగేషన్ సంబంధిత శాఖల అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. 350 మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్టు అనకాపల్లి డీఎస్పీ శ్రావణి తెలిపారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్టు కొత్తకోట సీఐ కోటేశ్వర్రావు తెలిపారు.

శైవ పుణ్యక్షేత్రం పంచదార్లలో...

రాంబిల్లి (యలమంచిలి): జిల్లాలో ప్రసిద్ధి చెందిన ప్రాచీన శైవ పుణ్యక్షేత్రంలో ఒక్కటైన పంచదార్ల ఉమాధర్మలింగేశ్వరుని ఆలయం మహా శివరాత్రి వేడుకలకు ముస్తాబైంది. జిల్లా నలుమూలలు నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి రానున్న నేపథ్యంలో దేవదాయ శాఖ, ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఫణిగిరి కొండ మీద ఉమాధర్మలింగేశ్వరుని ఆలయం వద్ద బారికేడ్లు, షామియానాలు వంటి ఏర్పాట్లు చేశారు. బుధవారం రాత్రి లింగోద్భవం వరకు భక్తులు కొండ మీద జాగరణ చేసి కొండ దిగువన రాధామాధవ స్వామివారి ఆలయం వద్ద పుణ్యధారల్లో పుణ్యస్నానాలు చేసి స్వామివారిని దర్శించుకుంటారు. ఈ ఆలయంతో పాటుగా కాశీ విశ్వేశ్వరుని, లలితా సహస్రలింగేశ్వరుని, ద్విముఖ కల్యాణ వినాయకుని ఆలయం వద్ద పూజలు చేస్తే కోరిన కోర్కెలు తీరుతాయని భక్తులు నమ్మకం. రాంబిల్లి మండలం పంచదార్ల శివారు ధారపాలెంలో వెలసిన ఉమాధర్మలింగేశ్వరుని ఆలయానికి బస్సులు, ఆటోలు ద్వారా రావడానికి సౌకర్యం కలదు. రాంబిల్లి మండలంలో వెల్చూరు, లాలంకోడూరు, దిమిలి గ్రామాల్లో పురాతన శివాలయాలు ముస్తాబయ్యాయి.

ధారమఠం వద్ద..

గొలుగొండ: శివరాత్రి ఉత్సవాలుకు ధారమఠం శివాలయం వద్ద ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. బుధవారం నుంచి మూడు రోజులు పాటు ఇక్కడ ఉత్సవాలు ఎంతో వైభవంగా నిర్వహించనున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని నర్సీపట్నం డీఎస్పీ శ్రీనివాసరావు పోలీసు సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. నర్సీపట్నం ఆర్టీసీ యాజమాన్యం గొలుగొండ నుంచి ధారమఠం శివాలయం వరకు 30 బస్సు సర్వీసులు నడపనుంది. బుధ, గురు, శుక్రవారాల్లో ఆర్టీసీ మినహా ప్రైవేట్ వాహనాలు తిరగడానికి అనుమతులు లేవని ఎస్ఐ రామారావు తెలిపారు.

నేడు స్వయంభూ గౌరీశ్వరస్వామి మహాలింగోద్భవ కాలాభిషేకం పూజ..

చోడవరం: జిల్లాలో అతి పురాతన శివాలయాల సమాహారంగా విరాజిల్లుతున్న చోడవరం పరిసరాల్లో దేవాలయాలన్నీ శివరాత్రి ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు చేశారు. చోడవరంలో మత్స్యరాజుల కాలంలో నిర్మించిన స్వయంభూ గౌరీశ్వరాలయానికి వేలాది మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉండటంతో బారికేడ్లు, ఇతర ఏర్పాట్లు చేశారు. రాత్రికి జాగారం సందర్భంగా అన్నమయ్య సంకీర్తన స్రవంతి, కూచిపూడి నృత్యం, ఆర్కెస్ట్రా, వివిధ కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. శారదా, పెద్దేరు, బొడ్డేరు నదులు కలిసి త్రివేణి సంగమంగా పేరొందిన ముద్దుర్తి వద్ద 900 ఏళ్లనాటి సంగమేశ్వరుని ఆలయం పుణ్యక్షేత్రంగా బాసిల్లుతోంది. గౌరీపట్నం సమీపంలో పెద్దేరు మార్కమ్మ రేవులో స్నానాలు చేస్తారు. ఈ రెండు స్నాన ఘట్టాల వద్ద ప్రత్యేక పోలీసు బందోబస్తు మధ్య పవిత్ర స్నానాలకు ఏర్పాట్లు చేశారు. జుత్తాడలో 800 ఏళ్ల క్రితం మత్స్యరాజులు కాలం నాటి శివాలయం ఉంది. ఇక్కడి శివలింగం స్పటిక లింగం కావడం ప్రత్యేకం. శారదానది ఒడ్డున గవరవరంలోని కాశీ విశ్వేశ్వరాలయంలో ఉత్సవాలు ఘనంగా జరిపేందుకు ఏర్పాట్లు చేశారు.

ఈవీఎం గొడౌను తనిఖీ



వీఎం గొడౌన్‌ను పరిశీలించిన కలెక్టర్ విజయ కృష్ణన్

తుమ్మపాల: ఎస్పీ కార్యాలయం ప్రాంగణంలో ఈవీఎం గొడౌనును కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి విజయకృష్ణన్ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి మంగళవారం తనిఖీ చేశారు. గొడౌను సీళ్లను, సీసీ కెమెరాలు, భద్రతా ఏర్పాట్లను పరిశీలించి నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. పరిశీలినకు సంబంధించి రికార్డులపై సంతకాలు చేశారు. కార్యకమంలో జిల్లా రెవెన్యూ డివిజినల్ అధికారి వై. సత్యనారాయణరావు, రెవెన్యూ డివిజినల్ అధికారి షేక్ ఆయిషా, జిల్లా అగ్నిమాపక అధికారి పి.నాగేశ్వరరావు, ఎలక్షన్ సెక్షను సూపరింటెండెంటు ఎస్.ఎస్.వి.నాయుడు పాల్గొన్నారు.

గుళ్లాట, కోడిపందేలపై పోలీసుల దాడి

బుచ్చెయ్యపేట: మండల కేంద్రంలో కోడిపందేలు, గుళ్లాటలపై పోలీసులు దాడి చేశారు. మంగళవారం బుచ్చెయ్యపేటలో ఆంజనేయస్వామి తీర్థం సందర్భంగా వీటిని నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడంతో తమ సిబ్బందితో దాడి చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. రెండు కోడి పుంజులతోపాటు ఇద్దరిని పట్టుకుని, వారి నుంచి రూ.1,420 స్వాధీనం చేసుకున్నామన్నారు. గుళ్లాట వద్ద ముగ్గురిని పట్టుకుని వారి నుంచి రూ.3,020 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రైవాడలో లారీ డ్రైవర్ అనుమానాస్పద మృతి

- వివాహేతర సంబంధమే మృతికి కారణమని బంధువుల ఆరోపణ
- మృతుడి తల్లి ఫిర్యాదుతో కేసు నమోదు



రమణ మృతదేహం



మృతుడు రమణ(ఫైల్)


దేవరాపల్లి: మండలంలో రైవాడ గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ వారాది రమణ(30) అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన మంగళవారం వెలుగు చూసింది. మృతదేహం నుంచి భరించలేని దుర్వాసన రావడంతో మూడు రోజులు క్రితమే మృతి చెంది ఉంటాడని కుటుంబీకులు అనుమానిస్తున్నారు. అతని మృతికి వివాహేతర సంబంధమే కారణమని ఆరోపిస్తూ మృతుడి కుటుంబీకులు, బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ టి.మల్లేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం... వారాది రమణకు పదేళ్ల క్రితం బొబ్బిలి సమీపంలోని కొమరాడకు చెందిన కృష్ణవేణితో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. లారీ డ్రైవర్‌గా పని చేస్తూ మద్యానికి బానిసైన రమణ తన గ్రామానికి చెందిన వేరొక మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకోవడంతో భార్యాభర్తల మధ్య మనస్పర్థలు తలెత్తాయి. ఇదే విషయమై వీరిద్దరూ గొడవలు పడగా, పలుమార్లు పెద్దలు రాజీ కుదుర్చారు. మూడు నెలల క్రితం ఇదే విషయమై వివాదం తలెత్తడంతో మృతుడి భార్య స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. తన భర్తలో ఏమాత్రం మార్పు రాకపోవడంతో పిల్లల్ని తీసుకుని రెండు నెలల క్రితం పుట్టింటికి వెళ్లిపోయింది.

తల్లి ఫోన్ ఎత్తకపోవడంతో అనుమానం...

మృతుడి తల్లి చినమ్మలు కూలీ పనులు చేసుకుంటూ విశాఖలో జీవనం సాగిస్తోంది. ఇంటి దగ్గర ఒంటరిగా ఉంటున్న కుమారుడితో రోజూ ఫోన్లో మాట్లాడుతోంది. ఆదివారం నుంచి ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్పందించకపోవడంతో బంధువులకు ఫోన్ చేసి ఆరా తీసింది. ఇంట్లో లైట్లు వేసి ఉన్నాయని, ఫ్యాన్ తిరుగుతుందని ఎంత పిలిచినా పలకడం లేదని ఆమెకు చెప్పారు. దీంతో అనుమానం వచ్చిన చినమ్మల్లు మంగళవారం మధ్యాహ్నం ఇంటికి వచ్చి తలుపులు తెరిచి చూడగా, మంచంపై కుమారుడు విగతజీవిగా పడి మృతి చెంది ఉండటాన్ని గమనించి బోరున విలపించింది. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు ఎస్ఐ టి.మల్లేశ్వరరావు, అదనపు ఎస్ఐ పి. రాములమ్మ ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. క్లూస్ టీమ్‌ను సైతం రప్పించి ఆధారాలను సేకరించారు. ఎస్ఐ మాట్లాడుతూ అనుమానాస్పద కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో లోతుగా దర్యాప్తు చేస్తున్నట్లు స్పష్టం చేశారు. రమణ మృతి చెందడంతో రైవాడలో విషాద ఛాయలు అలుముకున్నాయి. అతడి కుటుంబ సభ్యులు పుట్టెడు దుఃఖంలో మునిగిపోయారు.

తమిళనాడుకు 128 కేజీల గంజాయి రవాణా

- బొజ్జన్నకొండ రోడ్డులో ఆరుగురు అరెస్టు, రిమాండ్
- ఆటో, కారు, బొలేరో, ద్విచక్రవాహనం సీజ్
- రూ.1.30 లక్షలు, 6 సెల్‌ఫోన్లు స్వాధీనం



పట్టుబడిన నిందితులు, వాహనాలు వద్ద డీఎస్పీ శ్రావణి, సీఐ విజయకుమార్, ఎస్ఐలు

అనకాపల్లి: వి.మాడుగుల మండలం ఎం.కోడూరు నుంచి తమిళనాడు రాష్ట్రానికి గంజాయి రవాణా చేస్తున్న ఆరుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి ఆటో, కారు, బొలేరో వాహనం, ద్విచక్రవాహనం, రూ.1.30 లక్షలు, ఆరు సెల్‌ఫోన్లు, 128 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో మంగళవారం విలేకరుల సమావేశంలో డీఎస్పీ ఎం.శ్రావణి వివరాలు వెల్లడించారు. తమిళనాడు రాష్ట్రం ధర్మపూరి జిల్లా ధనుకరనహళ్లి గ్రామానికి చెందిన విజయ్ మాదుప్పన్, అదే జిల్లా హనుమందపురం గ్రామానికి చెందిన అరవిందన్ దాసన్ తమ ప్రాంతం నుంచి బొలేరో వాహనంతో ఈ నెల 24న అనకాపల్లి వచ్చారు. ఇక్కడ ఎం.కోడూరు గ్రామానికి చెందిన గున్నాబత్తుల సంతోష్‌కుమార్, గుమ్మాల నర్సింగరావు, గొల్లవిల్లి దుర్గా ప్రసాద్, బుచ్చెయ్యపేట మండలం విజయరామరాజుపేట గ్రామానికి చెందిన కోరుబిల్లి రమణబాబు అదే రోజు అర్ధరాత్రి బొలేరో వాహనం, ఆటో, కారు తీసుకుని అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు కొండ సమీపంలోని వి.మాడుగుల మండలం ఎం.కోడూరు సరిహద్దులో పాకల వద్దకు చేరుకున్నారు. అక్కడ దాచిన 64 ప్యాకెట్లతో ఉన్న 128 కేజీల గంజాయిని ఆటో, బొలేరో వాహనం, కారులో తరలిస్తుండగా, మూడు వాహనాలకు పైలట్‌గా దుర్గాప్రసాద్ ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. ఈ క్రమంలో అనకాపల్లి మండలం తుమ్మపాల పంచాయతీ పరిధి ఏలేరు కాలువ బొజ్జన్న కొండ రహదారిలో పట్టణ ఎస్ఐ డి.ఈశ్వరరావు మంగళవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా వారు పట్టుబడ్డారు. పట్టణ సీఐ టి.వి. విజయకుమార్ ఆరుగురు నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించినట్లు డీఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో పట్టణ ఎస్ఐలు అల్లు వెంకటేశ్వరరావు, టి.సత్యనారాయణ, సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

24 కిలోల గంజాయి పట్టివేత

నక్కపల్లి: మండలంలో సారిపల్లి పాలెం సమీపంలో తమిళనాడుకు చెందిన ముగ్గురు నిందితుల నుంచి 24 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ సన్నిబాబు తెలిపిన వివరాల ప్రకారం... తమిళనాడుకు చెందిన తమిళ అరసు, సెల్వం, రాజేంద్రల నుంచి మూడు స్కూలు బ్యాగుల్లో గంజాయి ఉందన్న సమాచారం మేరకు దాడులు నిర్వహించారు. వీరు గంజాయిని సీలేరు పరిసరాల్లో కొనుగోలు చేసి తమిళనాడుకు తరలించేందుకు సిద్ధపడుతుండగా పట్టుకున్నారు. ముగ్గురిపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు పంపించారు. గంజాయిలో ప్రమేయం ఉన్న మరో ఇద్దరిని పట్టుకునేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎస్ఐ తెలిపారు.

3 కిలోల హాష్ ఆయిల్ పట్టివేత

పెందుర్తి: ఏజెన్సీ ప్రాంతం నుంచి విశాఖకు అక్రమంగా తరలిస్తున్న రూ.5 లక్షల విలువైన 3 కిలోల హాష్ ఆయిల్(లిక్విడ్ గంజాయి)ని వేపగుంట ప్రాంతంలో పెందుర్తి పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. లిక్విడ్ గంజాయిని తరలిస్తున్న జి.మాడుగుల మండలం చినబంద గ్రామానికి చెందిన కొర్రా లక్ష్మి(36), అన్నవరం పంచాయతీ సోమవారం గ్రామానికి చెందిన శోభా కృష్ణ(40)లను అరెస్టు చేశారు. వీరిపై ఎన్‌డీపీఎస్ యాక్ట్-1985 సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు సీఐ ఎస్‌వీ సతీష్‌కుమార్ తెలిపారు. అక్రమ కార్యకలాపాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మాదక ద్రవ్యాల అక్రమ రవాణాకు పాల్పడుతున్నట్లు అనుమానం ఉన్న వ్యక్తులపై సమాచారం అందించాలని కోరారు.

నూకతాత పండగ చూతము రారండి

- రాజయ్యపేటలో ఘనంగా ఏర్పాట్లు
- జంతుబలి నిషేధం.. వింత ఆచారంతో మొక్కులు



ఆలయంలో నూకతాత విగ్రహాలు

నక్కపల్లి: మత్స్యకారుల ఆరాధ్య దైవం, గ్రామీణ ప్రాంతాల్లో ప్రసిద్ధి గాంచిన రాజయ్యపేట నూకతాత సంబరాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. గురువారం నూకతాత జాతర ఘనంగా నిర్వహిస్తారు. ఏటా శివరాత్రి ముందు రోజు నుంచి మూడు రోజుల పాటు నూకతాత జాతర మహోత్సవాలు అంగరంగ వైభంగా జరుపుతారు. మత్స్యకారులు భక్తి శ్రద్ధలతో ఈ వేడుక నిర్వహిస్తారు. మంగళవారం సాయంత్రం నుంచి పండగకు సంబంధించి కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. పూర్వీకుల నుంచి మత్స్యకారులు నూకతాతను తమ కులదైవంగా భావిస్తారు. గ్రామంలో ప్రత్యేకంగా నూకతాత ఆలయం నిర్మించి విగ్రహం ఏర్పాటు చేశారు. శివరాత్రి అమావాస్య నాడు రాత్రంతా జాగరణ చేసి వేకువజామున నూకతాత విగ్రహాలను సముద్ర స్నానానికి తీసుకెళ్తారు. స్నానం అనంతరం విగ్రహాలను పూజారులు ఆలయానికి తీసుకొస్తున్న సమయంలో రోడ్డుపై వందలాది మంది మత్స్యకారులు పడుకుంటారు. వారిని పూజారులు దాటుకుంటూ వెళ్తారు. ఈ పండగలో ఇదే విశేషం. గ్రామీణ ప్రాంతాల్లో గ్రామదేవతల పండగల సందర్భంగా కోళ్లు, మేకలను బలి ఇస్తారు. కాని నూకతాత పండక్కి మాత్రం జంతుబలి నిషేధం. ఈ పండగ నాడు నెత్తురు కనబడితే నూకతాత ఆగ్రహం చెందుతాడని గ్రామస్తులు తెలిపారు. కేవలం పండ్లు, శనగపప్పు మాత్రమే నైవేద్యంగా సమర్పిస్తామని మత్స్యకారులు తెలిపారు. నక్కపల్లి సీఐ కుమార స్వామి, ఎస్ఐ సన్నిబాబుల ఆధ్వర్యంలో పోలీసులు విస్తృత బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఆయిల్‌పామ్‌తో మంచి ఆదాయం



ఆయిల్‌పామ్ మొక్కలను పరిశీలిస్తున్న మలేషియా ప్రతినిధులు

కోటవురట్ల: ఆయిల్‌పామ్ మంచి ఆదాయాన్ని ఇచ్చే పంట అని మలేషియాకు చెందిన అయిల్‌పామ్ కంపెనీ ప్రతినిధులు తెలిపారు. రాజుపేటలో పతంజలి ఆయిల్‌పామ్ కంపెనీకి చెందిన ఆయిల్‌పామ్ నర్సరీని వారు మంగళవారం సందర్శించారు. రైతులతో సమావేశమై ఆయిల్‌పామ్ సాగు, యాజమాన్య పద్ధతులు, ఇక్కడి వాతావరణం, దిగుబడి తదితర అంశాలపై అధ్యయనం చేశారు. మలేషియా ప్రతినిధి ఆజా ఆజ్మాక మాట్లాడుతూ మలేషియాలో అత్యధికంగా హెక్టారుకు 60 టన్నుల వరకు దిగుబడి వస్తుండగా, సగటున 25 టన్నులు వరకు వస్తుందన్నారు. భారతదేశంలో వాతావరణ పరిస్థితుల ప్రకారం అత్యధికంగా 45 టన్నులు దిగుబడి రాగా, సగటున 15 టన్నులు దిగుబడి వస్తున్నట్టు గుర్తించామన్నారు. మరో ప్రతినిధి రోహానీ ముస్సీరా ఆయిల్‌పామ్ సాగులో ఉత్పన్నమయ్యే సమస్యలు, చీడపీడల నివారణ, యాజమాన్య పద్ధతులు వివరించారు. పతంజలి ఫుడ్స్ కంపెనీ జీఎం టి.వి.రమణ. ఏజీఎంలు పట్టాభిరామిరెడ్డి, రవీంద్ర, మేనేజర్లు టి.చంద్రశేఖర్, వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

కర్రి శ్రీనివాసరావుపై కేసు

నర్సీపట్నం: భవనాన్ని కూలగొట్టడమే కాకుండా.. భవన యజమాని సోదరుడు అయ్యరక కార్పొరేషన్ స్టేట్ మాజీ డైరెక్టర్, వైఎస్సార్‌సీపీ నాయకుడు కర్రి శ్రీనివాసరావుపై నర్సీపట్నం టౌన్ పోలీసులు కేసు నమోదు చేయడంపై నిరసన వ్యక్తమవుతోంది. దారుణమని వైఎస్సార్‌సీపీ నాయకులు పేర్కొంటున్నారు. ఈ నెల 24వ తేదీ తెల్లవారుజామున వందలాది మంది పోలీసులు, రెవెన్యూ అధికారులు శారదానగర్‌లోని భవనాన్ని కూలగొట్టిన విషయం తెలిసిందే. ఆ సందర్భంగా శ్రీనివాసరావు స్పీకర్ అయ్యన్నపాత్రుడిని దూషించారని, ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరుతూ టీడీపీ కౌన్సిలర్ ధనిమిరెడ్డి మధు నర్సీపట్నం టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కౌన్సిలర్ ఇచ్చిన ఫిర్యాదుపై బీఎన్ఎస్ 221, 351 (3), 352, 356 (2) రెడ్ విత్ 3 (5) సెక్షన్ల కింద సీఐ గోవిందరావు కేసు నమోదు చేశారు. రాజకీయ కక్షతో కర్రి శ్రీనివాసరావు సోదరుడి భవనం కూల్చివేయడమే కాక తప్పుడు ఫిర్యాదు చేసి, కేసులతో వేధిస్తున్నారని వైఎస్సార్‌సీపీ శ్రేణులు మండిపడుతున్నాయి.

ఫార్మా పరిశ్రమల్లో జీరో స్థాయికి ప్రమాదాలు

- సేఫ్టీ వర్క్‌షాప్‌లో అధికారులకు కలెక్టర్ విజయ కృష్ణన్ సూచన



సమావేశంలో ప్రసంగిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్

పరవాడ: ఔషధ పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ సూచించారు. జేఎన్ ఫార్మాసిటీలో మాన్యుఫాక్చరింగ్ అసోసియేషన్, మ్యూచువల్లీ ఎయిడెడ్ సొసైటీ ఫర్ రిస్క్ మెడికేషన్ భవన సముదాయంలో ఏపీ పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన ప్రాసెస్ సేఫ్టీ వర్క్ షాప్‌లో పాల్గొని, ప్రసంగించారు. ఫార్మా పరిశ్రమల్లో పనిచేసే భద్రత, తయారీ విభాగాల అధికారులు ఆధునిక సాంకేతికత పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలన్నారు. విధి నిర్వహణలో చాలా అప్రమత్తంగా వ్యవహరించి ప్రమాదాలను జీరో స్థాయికి తీసుకురావాలన్నారు. రానున్న రోజుల్లో ప్రమాదరహిత ఉత్పత్తులను సాధించాలని సూచించారు. ఉద్యోగుల భద్రతకు పూర్తి ప్రాముఖ్యత కల్పించాలన్నారు. ప్రస్తుతం నిర్వహించిన ప్రాసెస్ సేఫ్టీ వర్క్‌షాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జీరో యాక్సిడెంట్ పరిశ్రమలుగా తీర్చిదిద్దడానికి జేఎన్‌పీసీ యాజమాన్యాలు కృషి చేయాలని ఎంఏఎస్ఆర్ఎం కార్యదర్శి జెట్టి సుబ్బారావు సూచించారు. జెట్టి సుబ్బారావుకు జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ జ్ఞాపిక అందించి, సత్కరించారు. కార్యక్రమంలో జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జె.శివశంకర్‌రెడ్డి, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జీవీవీఎస్ నారాయణ, ఎస్‌హెచ్ఎస్ అధ్యక్షుడు రామసుబ్బారావు పాల్గొన్నారు. వర్క్‌షాప్‌నకు హాజరైన భద్రత, తయారీ విభాగాధికారులకు జేసీఐఎఫ్ శివశంకర్‌రెడ్డి సర్టిఫికెట్లను అందించారు.

ఖైదీలకు ఉచిత న్యాయసహాయం



ఖైదీలతో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి

చోడవరం రూరల్ : ఆర్థికంగా అవకాశం కుదరని రిమాండ్ ఖైదీలు కోరినట్టయితే ఉచిత న్యాయసహాయం అందచేస్తామని ఉమ్మడి విశాఖజిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి ఎం.వెంకటశేషమ్మ తెలిపారు. మంగళవారం ఆమె స్థానిక సబ్‌జైలును సందర్శించారు. ఖైదీలకు అందచేస్తున్న ఆహారం, పరిసరాలను పరిశీలించారు. రిమాండ్ ఖైదీల హక్కులకు భంగం వాటిల్లకుండా విధులు నిర్వహించాలని సబ్‌జైలు సిబ్బందికి సూచించారు. అనంతరం ఖైదీలను ఉద్దేశించి మాట్లాడారు. కోర్టులో వాదనలు వినిపించుకోవడానికి లీగల్ సర్వీసెస్ అథారిటీ సహాయ సహకారం అందిస్తున్న సంగతిని తెలుసుకోవాలని కోరారు. నేర ప్రవృత్తిని వీడి సమాజంలో ఇమిడేలా నడుచుకోవాలన్నారు. ప్యానల్ లాయర్ భూపతి రాజు, సబ్ జైలు ఇన్‌చార్జి సూపరింటెండెంట్ వీర్రాజు పాల్గొన్నారు.

సబ్‌జైల్ తనిఖీ..

నర్సీపట్నం : జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వెంకట శేషమ్మ మంగళవారం స్థానిక సబ్‌జైలును తనిఖీ చేశారు. నెలవారి తనిఖీల్లో భాగంగా ఆమె జైలును సందర్శించారు. జైల్ రికార్డులను పరిశీలించారు. అనంతరం ఖైదీలను కలిసి వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఖైదీలు సత్ప్రవర్తన కలిగి ఉండాలని సూచించారు. చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడి నేరస్తులుగా ముద్ర వేయించుకోవద్దని సూచించారు. జైల్ సూపరిండెంటెంట్ సన్యాసిరావుకు పలు సూచనలు చేశారు.

లారీ ఢీకొని యువకుడి దుర్మరణం



మృతుడు దుర్గాప్రసాద్ (ఫైల్)

నక్కపల్లి: స్థానిక జాతీయ రహదారిపై వేంపాడు టోల్ ప్లాజా సమీపంలో బైక్‌ను లారీ ఢీకొట్టింది. ఈ సంఘటనలో యువకుడు దుర్మరణం పాలయ్యాడు. నక్కపల్లి పోలీసుల వివరాల మేరకు.. కాకినాడ జిల్లా గొల్లప్రోలుకు చెందిన చిక్కాల శ్యామ్ ప్రసాద్(29) వేంపాడు సమీపంలో సుబి ఇన్‌ఫ్రా ఫ్యాబ్రికేషన్ వర్క్ షాపులో పని చేస్తున్నాడు. సోమవారం రాత్రి తన స్నేహితుడితో కలిసి బైక్‌పై టోల్‌ప్లాజా వద్ద టీ పాయింట్‌కు వెళ్తుండగా, వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో బైక్ నడుపుతున్న శ్యామ్‌ప్రసాద్ తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. వెనుక కూర్చొన్న స్నేహితుడు సాయిబాబా గాయపడ్డాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని నక్కపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడు కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సన్నిబాబు తెలిపారు.

చెరకు లారీ బోల్తా



బోల్తాపడిన చెరకు లోడుతో వెళ్తున్న లారీ

బుచ్చెయ్యపేట : భీమునిపట్నం, నర్సీపట్నం (బీఎన్) రోడ్డులో విజయరామరాజుపేట డైవర్షన్ రోడ్డుపై చెరకులోడు లారీ బోల్తా పడింది. వడ్డాది నుంచి చోడవరం వైపు 20 టన్నుల బరువున్న లారీ డైవర్షన్ రోడ్డు దిగి ఎక్కుతుండగా గోతుల్లో పడి తిరగబడింది. ఈ సమయంలో లారీ పక్కన పాదచారులు, వాహనదారులు ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. లేకపోతే ప్రాణ, ఆస్తి నష్టం జరిగేదని పలువురు వాహనదారులు ఆరోపిస్తున్నారు. లారీ తిరగబడుతుండగా డ్రైవర్ క్యాబిన్‌లో నుండి చాకచక్యంగా గెంతేయడంతో స్వల్ప గాయాలతో బైటపడ్డాడు. కోనాం, వడ్డాది, చోడవరం వైపు కొంతసేపు ట్రాఫిక్ నిలిచిపోవడంతో ఎస్ఐ శ్రీనివాసరావు తమ సిబ్బందితో వచ్చి ట్రాఫిక్‌ను నియంత్రించారు.

కియోస్క్ సేవలపై కూటమి కక్ష

సచివాలయ వ్యవస్థతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పేరు ప్రఖ్యాతులు వస్తాయన్న అక్కసుతో చంద్రబాబు సర్కారు కుయుక్తులు పన్నుతోంది. క్రమంగా దీన్ని విచ్ఛిన్నం చేసి ప్రజలకు దూరం చేయడానికి వ్యూహం రచిస్తోంది. ఇందులో భాగంగా నియోజకవర్గంలో నాడు రైతు భరోసా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన కియోస్క్ యంత్రాలను మూలన పడేసింది. వీటి కోసం వెచ్చించిన రూ.43 లక్షల వృథా చేసింది.

- రైతు సేవా కేంద్రాల్లో మూలనపడ్డ యంత్రాలు
- గత ప్రభుత్వంపై అక్కసుతోనే సేవలు నిలిపివేత
- నియోజకవర్గంలో నిరుపయోగంగా 43 యంత్రాలు
- వీటి కోసం వెచ్చించిన రూ.43 లక్షల వృథా



కియోస్క్ యంత్రాల్లో వ్యవసాయ సమాచారం తెలుసుకుంటున్న రైతులు

తుమ్మపాల: వ్యవసాయమంటే దండగ కాదు పండుగ అనే విధంగా వైఎస్సార్‌సీపీ హయాంలో అప్పటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి గ్రామంలో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారు. రైతులకు వ్యవసాయాధికారులను అందుబాటులో ఉంచారు. రైతు సంక్షేమమే లక్ష్యంగా పనిచేశారు. సాగును సంబరంగా మార్చేందుకు విశేషంగా కృషి చేశారు. అన్నదాతలకు సకల సమాచారం అందించాలనే లక్ష్యంతో ఆర్బీకేల్లో కియోస్క్ యంత్రాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. భూసార పరీక్ష నుంచి అధిక దిగుబడి సాధించేందుకు అవసరమైన అన్ని రకాల సేవలను పల్లె ముంగిటకే చేర్చారు. కియోస్క్ యంత్రాల ద్వారా ఎరువులు, పురుగు మందులను ముందస్తుగా బుక్ చేసుకునే వెలుసుబాటు కల్పించారు. ఏ భూమిలో ఏ పంట సాగు చేయాలి. దానికి సంబంధించిన విత్తనాలు, పురుగుల మందులు, ఎరువులు గురించి తెలుసుకోవడం, పశువులకు వచ్చే రోగాలకు సంబంధించి అన్ని ప్రయోగాలు కియోస్క్ యంత్రం ద్వారా తెలుసునేలా ఏర్పాటు చేశారు. కూటమి సర్కార్ వీటిని రైతుల నుంచి దూరం చేయడానికి కుయుక్తులు పన్నుతోంది. రైతు సేవా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన యంత్రాలను మూలన పడేసింది. ఎనిమిది నెలల్లో ఒక్కసారీ వినియోగించిన పాపాన పోలేదు.

జగన్‌కు పేరు వస్తుందనే అక్కసు...

అనకాపల్లి నియోజకవర్గంలో పట్టణంతోపాటు, రెండు మండలాల్లోను 43 రైతు భరోసా కేంద్రాలు ఉన్నాయి. అనకాపల్లి మండలంలో 24, కశింకోట మండలంలో 19 ఆర్బీకేలు ఉండగా, 43 కియోస్క్ యంత్రాలను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందుబాటులో ఉంచింది. వీటి ద్వారా స్థానిక రైతులకు వ్యవసాయ అధికారులు, వీఏఏలు, వీహెచ్ఏలు సమగ్రమైన సమాచారం అందించేవారు. విత్తనాలు, ఎరువులు ముందుగానే బుక్ చేసుకునేవారు. ఇప్పుడు ఈ సేవలు పొందే పరిస్థితి లేకుండా చేశారు. గత వైఎస్సార్‌సీపీ హయాంలో కియోస్క్ మిషన్ సేవలకు శ్రీకారం చుట్టిన మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి పేరు ప్రఖ్యాతులు వస్తాయన్న అక్కసుతో వాటిని వినియోగించకుండా రైతులు మర్చిపోయేలా చేస్తున్నారు. దాంతో సాగు పద్ధతుల్లో నష్ట నివారణకు సకాలంలో సరైన సూచనలు లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. దళారుల బెడద లేకుండా పంటను అమ్ముకునేందుకు సహాయపడే అవకాశం కూడా లేకుండా చేశారు.

నిరుపయోగంగా మారిన కియోస్క్, ప్రభుత్వ నిధులు వృథా

కేవలం గత ప్రభుత్వం ఏర్పాటు చేసిందనే అక్కసుతో లక్షల రూపాయలు వృథా అవుతున్నా కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఒక్కొక్క కియోస్క్ ఏర్పాటుకు రూ.90 వేల నుంచి రూ.లక్ష వరకు ప్రభుత్వం ఖర్చు చేసింది. కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యానికి నియోజవర్గంలో రూ.43 లక్షల విలువైన యంత్రాలు మూలకు చేరాయి.

జగన్ బొమ్మ కనిపిస్తుందని నిలిపివేత..



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన కియోస్క్ యంత్రాల ద్వారా ఎరువులు, పురుగుల మందులు బుకింగ్, వాతావరణ సమాచారం తెలుసుకుని తద్వారా వ్యసాయంలో పలు పంటలు సాగు చేపట్టాం. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత కియోస్క్ యంత్రాలను కనీసం ఓపెన్ చేయడం లేదు. కియోస్క్ యంత్రాల్లో మాజీ ముఖ్యమంత్రి జగన్ చిత్రం కనిపిస్తుందని వాటి సేవలు నిలిపివేశారు. దీంతో రైతులకు సకాలంలో సేవలందక పంటలు తెగుళ్ల బారిన పడుతున్నాయి.

– నారపిన్ని ప్రసాద్, రైతు, అక్కిరెడ్డిపాలెం

వరిలో జింకు లోపం నివారణకు చర్యలు

అనకాపల్లి: వాతావరణ పరిస్థితులకు వరిలో జింకు లోపం కనిపించే అవకాశం ఉందని, నివారణకు 2 గ్రాముల జింకు సల్ఫేట్, 5 గ్రాముల యూరియాను ఒక లీటరు నీటిలో కలిపి ఐదు రోజుల వ్యవధిలో 2–3 సార్లు పిచికారీ చేయాలని ప్రాంతీయ వ్యవసాయపరిశోధనా స్థానం ఏడీఆర్ సీహెచ్ ముకుందరావు అన్నారు. స్థానిక ఆర్ఏఆర్ఎస్ కార్యాలయంలో మంగళవారం శాస్త్రవేత్తలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పిలకల పెట్టె దశలో ఉన్న వరిపైరులో ఎకరాకు 35 కిలోల యూరియాను వేసుకోవాలన్నారు. వెడల్పాటి ఆకు జాతి కలుపు మొక్కలున్నట్లయితే నాటిన 30 రోజులప్పుడు 2,4 డి సోడియం సాల్ట్ అనే కలుపు మందును ఎకరానికి 400 గ్రాములు 200 లీటర్ల నీటిలో కలిపి వేసుకోవాలన్నారు. పొడి వాతావరణ ఉడడం వల్ల అపరాలు బెట్ట పరిస్థితులకు గురయినట్లయితే తేలికపాటి తడి ఇవ్వాలన్నారు. వేరుశనగలో ఆకు ముడత పురుగు ఆశించే అవకాశం ఉందన్నారు. నివారణకు మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ లీటరు నీటికిచొప్పున కలిపి పిచికారీ చేయాలన్నారు. నువ్వులు విత్తిన రైతులు పంట వేసిన 30 రోజులకు ఒక తేలికపాటి తడి ఇవ్వాలని, ఎకరాకు 20 కిలోల యూరియాను వేసుకోవాలన్నారు. చెరకు కార్శి తోటకు మోళ్లు చెక్కిన పిదప ఎకరాకు 100 కిలోల యూరియా, 250 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, 80 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ దుబ్బులకు దగ్గరగా గోతులు తీసి ఎరువు వేసి మట్టితో కప్పిన తర్వాత తేలికపాటి తడిని ఇవ్వాలన్నారు. చెరకు కార్శి తోటలలో ప్రధానంగా విశ్వామిత్ర వంటిరకాలలో కొరడా తెగులు ఆశించకుండా కార్శి చేసిన వెంటనే ప్రొపికొనజోల్ 1 మి.లీ లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు టి.శ్రీలత, కె.వి.రమణమూర్తిత, డి.ఆదిలక్ష్మి, వి.గౌరీ, బి.భవాని పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు శ్రీలక్ష్మి అమ్మతల్లి తీర్థం



తుమ్మపాల: మండలంలో వెంకుపాలెం గ్రామంలో వెలిసిన బాల పేరంటాలు శ్రీలక్ష్మి అమ్మతల్లి 47వ తీర్థ మహోత్సవం ఈ నెల 26న ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. తెల్లవారు నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు. శుక్రవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. సాయంత్రం 4 గంటల నుంచి ముగ్గులు పోటీలు, రాత్రికి దీపారాధన కార్యక్రమం జరగనుందని, భారీ ఎత్తున బాణసంచా కాల్చుతామన్నారు. ఈ సందర్భంగా ఈ నెల 27, 28 తేదీల్లో గ్రామస్థాయి షటిల్ పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరి



ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకుంటున్న రైతులు

అనకాపల్లి: రైతు విశిష్ట గుర్తింపు నమోదు కార్యక్రమాన్ని తప్పనిసరిగా సచివాలయాల్లో నమోదు చేసుకోవాలని అక్కిరెడ్డిపాలెం సర్పంచ్ సాలాపు శాంతిసూరిఅప్పారావు కోరారు. మండలంలో అక్కిరెడ్డిపాలెం సచివాలయంలో మంగళవారం రైతులతో రైతు విశిష్ట ఆన్‌లైన్ గుర్తింపు నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. సచివాలయం పరిధిలో రైతులందరూ ఆన్‌లైన్లో వారి భూమి వివరాలను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

మద్యం దుకాణానికి సీల్లేవి సారూ...



షట్టర్ వేసినా తాళం కప్పలకు లేని సీళ్లు

కశింకోట: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నిబంధనల ప్రకారం మండలంలోని మద్యం దుకాణాలను మంగళవారం మూసివేశారు. వాటి తలుపులకు తాళం కప్పలు వేసినప్పటికీ అధికారులు సీళ్లు మాత్రం వేయలేదు. దీనివల్ల వాటిని తెరచి విక్రయించడం, పంపిణీకి తరలించే అవకాశం ఉందని, నిబంధనల ప్రకారం అధికారికంగా సీళ్లు వేయడానికి చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకుడు సూరిశెట్టి ఆదిబాబు కోరారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు మంగళవారం 8,702 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,690	4,690
మొదటి రకం	3,550	4,270
రెండో రకం	3,180	3,770
మూడోరకం	2,930	3,140

అనకాపల్లి సినిమాలు

రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్ : రాజా
ఆరెంజ్ : సత్యనారాయణస్క్రీన్-1(ఉదయం)
పుష్ప-2 : సత్యనారాయణస్క్రీన్-1(మ్యాట్నీ, 1,2 షోలు)
జాబిలమ్మ నీకు అంత కోపమా : సత్యనారాయణ స్క్రీన్-2
తండేల్ : పర్లిసాయి
సంక్రాంతికి వస్తున్నాం : షిర్డీసాయి
సూర్య కృష్ణన్ : వెంకటేశ్వర(ఉదయం)
తల : వెంకటేశ్వర(మ్యాట్నీ, 1, 2 షోలు)
సై : శ్రీసత్య
రామం రాఘవం : రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 56 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-5 యూనిట్లు, బీ పాజిటివ్-20 యూనిట్లు, ఓ పాజిటివ్-29 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 417 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 369 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924–223595 నంబరును సంప్రదించవచ్చు.

శివాలయాలు సర్వం సిద్ధం



కశింకోటలోని పురాతన శివాలయానికి ముస్తాబు చేస్తున్న భక్తులు



కశింకోటలో త్రిపురాంతకస్వామి



శివపార్వతుల ఉత్సవ విగ్రహాల ఊరేగింపు కార్యక్రమంలో కోలాటం



కేఎస్ఆర్‌పేట గ్రామంలో శివాలయం

కశింకోట: శైవక్షేత్రాలు మహా శివరాత్రి పూజలకు సిద్ధమయ్యాయి. కశింకోటలోని పురాతన సర్వమంగళాంబ సమేత త్రిపురాంతకస్వామి ఆలయం (శివాలయం)లో ఈ సందర్భంగా ఉదయం పంచామృతాలతో అభిషేకం, ప్రత్యేక అభిషేకాలు, సాయంత్రం ఏకాదశ పూర్వక మహా రుద్రాభిషేకం, అర్ధరాత్రి సమయంలో లింగోద్భవ పూజలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఆలయాన్ని మామిడి దాకుల తోరణాలు కట్టి విద్యుద్దీపాలతో అందంగా అలంకరించారు. మధ్యాహ్నం అన్న సమారాధన, సాయంత్రం లింగ దీపార్చన కార్యక్రమాలు జరుగుతాయని అర్చకులు వి. చిదంబరం, వి. కృష్ణ తెలిపారు. స్థానిక కస్పావీధిలోని సాంబశివుని ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక అభిషేకాలు, రుద్రాభిషేకాలు జరుగుతాయని అర్చకుడు వేయి దశంల ప్రసాద్ తెలిపారు. స్థానిక గవరపేటలోని వేంకటేశ్వర ఆలయం ప్రాంగణంలో కొలువైన ఉమా మహేశ్వరుల ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక అభిషేకాలు, పూజలు జరుగుతాయని, మధ్యాహ్నం అన్న సమారాధన నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు భీశెట్టి దుర్గానాగేశ్వరరావు, అర్చకుడు సుబ్రహ్మణ్యం తెలిపారు.

ఏఎస్ పేటలో గిరి ప్రదక్షిణ..

అమీన్‌సాహెబ్‌పేట వద్ద వెలసిన సాంబశివుని లోవలో మహా శివరాత్రి సందర్భంగా తొలిసారిగా గిరి ప్రదక్షిణ ఏర్పాటు చేసినట్లు విశాఖ డెయిరీ డైరెక్టర్ మలసాల రమణారావు తెలిపారు. ఉదయం ఆలయం 9 గంటల నుంచి లోవ నుంచి ప్రదక్షిణ ప్రారంభమై నరసాపురం, ఏఎస్ పేట, గొబ్బూరుపాలెం, పల్లపు సోమవరం గ్రామాల మీదుగా కొండ చుట్టూ జరుతుందన్నారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశామన్నారు. చిటికెన భజనలు, తోడపెద్ద సేవ ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. వెదురుపర్తిలో ఉమా రామలింగేశ్వర స్వామి, బయ్యవరం, పేరంటాలపాలెం, సోమవరం, నూతలగుంటపాలెం, చింతలపాలెం, కన్నూరుపాలెం గ్రామాల్లోని శివాలయాలు, బంగారయ్యపేటలోని బసవేశ్వరస్వామి ఆలయం, సాంబమూర్తి ఆలయం, తాళ్లపాలెం సంతలోని రామలింగేశ్వరస్వామి ఆలయం, ఉగ్గినపాలెంలోని ఉమా సోమేశ్వరస్వామి ఆలయాల్లో మహా శివరాత్రి ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడానికి సన్నాహాలు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

అనకాపల్లి: జీవీఎంసీ విలీన గ్రామం కె.ఎస్.ఆర్.పేటలో కొండమీద వెలసిన ఉమామహేశ్వర స్వామి ఆలయంలో బుధవారం మహా శివరాత్రి ఉత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్టు ఆలయ ప్రతినిధి చూచుకొండ రమణ మంగళవారం ఒక ప్రకటలో పేర్కొన్నారు. మధ్యాహ్నం స్వామివారి ఆలయం వద్ద భారీ అన్నసమారాధన, సాయంత్రం 6 గంటలు ఆలయ వద్ద కోలాటాలు, చిటికెల భజన, శివనామాలు భజన వంటి అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

శివపార్వతుల విగ్రహాల ఊరేగింపు...

స్థానిక శారదానది ఒడ్డున ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయ కమిటీ సభ్యులు శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను పట్టణంలో పురవీధుల్లో మంగళవారం రాత్రి రథంపై ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సంపద కేంద్రాలతో పంచాయతీలకు ఆదాయం



సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీవో శిరీషారాణి

కశింకోట: సంపద కేంద్రాలు సమర్థవంతంగా నిర్వహించి సేంద్రియ ఎరువు ఉత్పత్తి చేసి తద్వారా పంచాయతీలకు ఆదాయం సమకూరడానికి ప్రజలు సహకరించాలని జిల్లా పంచాయతీ అధికారి శిరీషారాణి కోరారు. మండలంలోని బయ్యవరం, తాళ్లపాలెం గ్రామాల్లోని సంపద కేంద్రాల నిర్వహణ తీరును మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలు తడి, పొడి చెత్తను వేరు చేసి దానిలో తడి చెత్తను పంచాయతీ సిబ్బందికి అందజేస్తే దాన్ని సంపద కేంద్రానికి తరలించి అక్కడ సేంద్రియ ఎరువు తయారీకి వినియోగిస్తారన్నారు. దీన్ని విక్రయించడం ద్వారా పంచాయతీకి ఆదాయం సమకూరి అభివృద్ధి పనుల నిర్వహణకు ఉపయోగపడుతుందన్నారు. సంపద కేంద్రాల పని తీరు, వర్మీ కంపోస్టు సేంద్రియ ఎరువు తయారీపై ప్రజలకు అవగాహన కలిగిస్తున్నామన్నారు. ప్రజల సహకారంతో చెత్త నుంచి సంపద సృష్టించడానికి సిబ్బంది కృషి చేయాలన్నారు. ఈవోపీఆర్డీ ఎం. వెంకటలక్ష్మి, కార్యదర్శులు సత్యారావు, బాబూరావు, సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఘనంగా ముత్యాలమ్మ ఉత్సవం

కశింకోట: మండలంలోని తేగాడ గ్రామంలో ముత్యాలమ్మ ఉత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడి శారదానది అవతల చెట్టు రూపంలో వెలసిన అమ్మవారిని ఎక్కువ సంఖ్యలో ప్రజలు దర్శించారు. చీరలు, రవికెలు, అరటి గెలలు తదితర రూపాల్లో మొక్కులు తీర్చుకున్నారు. గ్రామంలో రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సర్పంచ్ నీటిపల్లి ఈశ్వరమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు తుంపాల మంగతాయారు, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ నీటిపల్లి లక్ష్మి, ఉత్సవ కమిటీ నిర్వాహకుడు నీటిపల్లి దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ స్థాయి నుంచి వైఎస్సార్‌సీపీ బలోపేతం



భరత్‌కుమార్‌ను శాలువాలతో సత్కరిస్తున్న పార్టీ ప్రతినిధులు

అనకాపల్లి: గ్రామీణ స్థాయి నుంచి వైఎస్సార్‌సీపీని బలోపేతం చేసేందుకు గ్రామాల్లో సమావేశాలు నిర్వహిస్తున్నట్లు పార్టీ మండలాధ్యక్షుడు పెదిశెట్టి గోవింద్ అన్నారు. మంగళవారం స్థానిక రింగ్‌రోడ్డు పార్టీ కార్యాలయంలో పార్టీ మండలాధ్యక్షుడు పెదిశెట్టి గోవింద్, కశింకోట మండలాధ్యక్షుడు మలసాల కిషోర్, జిల్లా ఐటీ వింగ్ అధ్యక్షుడు పల్లెల సాయికిరణ్ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్ కుమార్‌ను శాలువాలతో సత్కరించారు. వారు మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. 80వ వార్డు ఇన్‌చార్జ్ కె.ఎం.నాయుడు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థినులకు కళ్లద్దాల పంపిణీ



బాలికలకు కళ్లజోళ్లు పంపిణీ చేస్తున్న వైద్యాధికారి మనీషా

కశింకోట: తాళ్లపాలెంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఏపీ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో మంగళవారం 69 మంది బాలికలకు ఉచిత కళ్లజోళ్లు పంపిణీ చేశారు. గతంలో బాలికలకు పరీక్షలు నిర్వహించిన సందర్భంగా కంటి లోపాలను గుర్తించి సిఫార్స్ చేసిన నేపథ్యంలో రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో వీటిని అందించారు. తాళ్లపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి ఎ. మనీషా పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో ఆరోగ్య బోధకుడు ఎం.ఎస్.వి. ప్రసాద్ ఆప్తాలమిక్ యు. ఆనంద రావు, ఆప్తాలమిక్ ఆఫీసర్ సి.హెచ్. ప్రసాద్, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ జి. గ్రేస్, ఆరోగ్య పర్యవేక్షకుడు కె.ఎస్.ఆర్. కె.జి. నరసింహారావు, హెల్త్ అంబాసిడర్ బి. శ్రీదేవి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

రెండు రోజులు మద్యం షాపులు బంద్



మద్యం షాపులు మూయిస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

సబ్బవరం: ఈ నెల 27న జరగనున్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మంగళవారం సాయంత్రం నుంచి సబ్బవరం ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని మద్యం షాపులను మూసేశారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ ఇన్‌స్పెక్టర్ డి.అనిల్‌కుమార్ మాట్లాడుతూ సబ్బవరం మండలంలోని 8 మద్యం షాపులు, పరవాడ మండలంలోని 14 మద్యం షాపులు, రెండు బార్లు మూసివేసి, సీల్ వేసినట్లు పేర్కొన్నారు. 27న సాయంత్రం ఎన్నికల ప్రక్రియ ముగిశాక యథావిధిగా షాపులు తెరుచుకోవచ్చన్నారు. ఎక్కడైనా బెల్ట్ షాపులకు మద్యం సరఫరా చేస్తూ పట్టుబడితే సంబంధిత మద్యం షాపు యజమానులపై రూ.5 లక్షల వరకూ జరిమానా విధించనున్నట్లు హెచ్చరించారు. రెండో సారి పట్టుబడితే లైసెన్స్ రద్దు చేస్తామన్నారు. గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహించినా, అక్రమంగా మద్యం విక్రయించినా కఠిన చర్యలు తప్పవన్నారు.

దేవీపురంలో ప్రత్యేక పూజలు



దేవీపురంలోని శ్రీచక్రాలయం

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి క్షేత్రంలో మహాశివరాత్రిని పురస్కరించుకుని బుధవారం ప్రత్యేక పూజలు, కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు గురుమాత అన్నపూర్ణమ్మ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం గో పూజతో ప్రారంభమై దక్షవాటిలో మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రుద్రహోమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సాయంత్రం 4 నుంచి 5 వరకు పల్లకీ సేవ, 5 నుంచి 7 వరకు కామాఖ్య కల్యాణం జరుగుతుందన్నారు. రాత్రి 10 నుంచి లింగోద్భవ కాలం వరకూ కొండమీద శివాలయంలో రాజరాజేశ్వరునికి, ఆనంద భైరవుడికి పంచామృతాభిషేకాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

మునగపాక: మండలంలోని కాకరాపల్లి శివారులో పేకాడుతున్న ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ పి.ప్రసాదరావు తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. కాకరాపల్లి శివారులో పేకాడుతున్నట్లు అందిన ఫిర్యాదు మేరకు సిబ్బందితో కలిసి మంగళవారం సాయంత్రం దాడి చేశామన్నారు. ఈ దాడిలో పేకాడుతున్న ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి రూ.21,800 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ప్రసాదరావు తెలిపారు.

సక్రమ డ్రైవింగ్‌తోనే సురక్షిత ప్రయాణం

ఎస్.రాయవరం: ప్రైవేటు పరిశ్రమల వాహనాల డ్రైవర్లు వాహనాలు వేగంగా నడిపి ప్రమాదాలకు కారకులవుతున్నారని అడ్డురోడ్డు సీఐ రామకృష్ణ అన్నారు. అడ్డురోడ్డులోని కార్యాలయం వద్ద మంగళవారం హెటిరో పరిశ్రమ బస్సు డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇక్కడి కూడలిని ఆనుకుని అనేక పరిశ్రమల బస్సులు పెద్ద సంఖ్యలో రవాణా సాగిస్తున్నాయని, డ్రైవింగ్ సక్రమంగా చేసి కార్మికులను గమ్యస్థానాలకు చేర్చాలన్నారు. ఇరుకురోడ్లలో నెమ్మదిగా ప్రయాణించి తోటి వాహనాలకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ప్రధాన జంక్షన్లలో రద్దీగా ఉన్న సమయాల్లో బస్సుల రాకపోకల సమయాలు మార్పు చేసుకోవాలన్నారు. అలాగే పరిశ్రమల వారీగా మిగిలిన డ్రైవర్లకు కూడా అవగాహన నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ విభీషణరావు తదితరులు పాల్గొన్నారు.